ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 5 మే 2025


సన్మాన కార్యక్రమానికి హాజరైన జనం

పద్మభూషణుడికి సన్మానం..

పులకించిన పురం..

ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘనంగా పౌరసన్మానం

కిక్కిరిసిన పురం రోడ్లు

20వేల మందికిపైగా హాజరు

(వివరాలు 7వ పేజీలో...)


గుర్రాల రథంపై వస్తున్న బాలకృష్ణ దంపతులు

గుట్టల్లో గుబులు..!

గుట్టుగా వ్యవహారం నడిపిస్తున్న రెవెన్యూ

వన్యప్రాణుల ఉనికికి ప్రమాదం

పశువులు, గొర్రెలకు మేత కరువయ్యే దుస్థితి

• ప్రైవేటుకు పచ్చధనం..! • సోలార్ కంపెనీకి అప్పగించే ప్రయత్నాలు

తనకల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిరెడ్డిపల్లి పరిధి సర్వే నంబరు 63లో 200 ఎకరాల్లో గుట్టలు వ్యాపించి ఉన్నాయి. నిత్యం పచ్చదనంతో అలరారుతుంటాయి. పశువులు, గొర్రెలకు ఏడాది పొడవునా గుట్టల్లో మేత దొరుకుతుంది. వన్యప్రాణులకు కూడా ఆవాసంగా వెలుగొందుతోంది. చుట్టుపక్కల గ్రామాలకు ఈ గుట్టలు ఎంతో ఆధారం. ఈ గుట్టలను ఆనుకుని పాపాఘ్ని నది ప్రవహిస్తోంది. గుట్టలకు పైభాగాన పెద్దపల్లి వద్ద రిజర్వ్ అటవీప్రాంతం ఉంది. ఫారెస్టు నుంచి వన్యప్రాణులు నీటికోసం ఈ రెవెన్యూ గుట్టల గుండా పాపాఘ్ని నదికి వస్తుంటాయి. అలా.. ఈ గుట్టలు పచ్చదనంతో, ప్రకృతి సంపదతో అలరారుతుంటాయి. అలాంటి గుట్టలను ప్రైవేటుకు అప్పగించే ప్రయత్నాలు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఓ సోలార్ కంపెనీకి కట్టబెట్టే ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం.


ప్రైవేటుకు అప్పగించడానికి అధికారులు సిద్ధం చేసిన భూమి

గుట్టలే ఆధారం

మండలంలోని మల్లిరెడ్డిపల్లి వద్దగల గుట్టలు ఆ ఊరితోపాటు వడ్డమరపల్లి, ఎర్రబల్లి, పెద్దపల్లి, గేమేనాయక్ తండా పంచాయతీలోని కమంతపల్లి, తులసేనాయక్ తండా, నాయనచెరువులపల్లి, జామ్లానాయక్ తండా, ముండ్లవారి పంచాయతీలోని బీమ్లానాయక్ తండా, పెండ్లిగుండుతండా గ్రామాల పశువులు, గొర్రెల కాపర్లకు ఆసరాగా ఉన్నాయి. తరతరాలుగా ఈ గ్రామాల ప్రజలు ఆ రెవెన్యూ గుట్టలపైనే ఆధారపడి పశుసంపదను పోషించుకుంటున్నారు. అలాంటి గుట్టలను రెవెన్యూ యంత్రాంగం.. ఓ సోలార్ కంపెనీకి అప్పగించడానికి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో రెవెన్యూ గుట్టలపై ఆధారపడి పశుసంపదను పోషించుకుంటున్న అనేకమంది కాపర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే సోలార్ కంపెనీ ప్రతినిధులు ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్‌కు వినతులు అందించినట్లు సమాచారం.



ఈ విషయంపై స్థానిక రెవెన్యూ యంత్రాంగం కూడా గుట్టుచప్పుడు కాకుండా సర్వేలు చేసి, అన్నీ సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉన్న పచ్చదనాన్ని కూడా హరిస్తే ఈ ప్రాంతం ఏమవుతుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ గుట్టలపై ఇప్పటికే పలువురికి పట్టాలు మంజూరు చేశారు. ఎవరూ సాగులో లేకపోవడంతో వాటిని రద్దు చేసి, సోలార్‌కు అప్పగిస్తారన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. రెవెన్యూ యంత్రాంగం కూడా ఆ మేరకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పట్టాలు పొందిన వారు సైతం తాము ఇప్పటికే పంట రుణాలు తీసుకున్నామనీ, ఇప్పుడు రద్దు చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వాలు మొండిగా ముందుకెళ్తే ఆందోళనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

గొర్రెలు ఏడ మేపుకోవాలి సామీ?



మా గ్రామం వద్ద ఉన్న గుట్టలను సోలార్ కంపెనీకి అప్పగిస్తే మేం గొర్రెలు ఎక్కడ మేపుకోవాలి సామీ? ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే ఆందోళనలు తప్పవు.

-రెడ్డెప్ప, గొర్రెల కాపరి, వడ్డమరవపల్లి

20 గ్రామాల ప్రజలకు ఆధారం



20 గ్రామాల ప్రజలకు ఆధారమైన గుట్టలను ప్రైవేటుకు ఎలా అప్పగిస్తారు? ఈ విషయంపై ఇప్పటికే రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. అలాగే ముందుకెళ్తే ఆందోళన చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

-శంకర్‌రెడ్డి, రైతు, ఎర్రబల్లి

గుట్టలను అప్పగించవద్దు



ప్రభుత్వ భూములను సోలార్ కంపెనీకి అప్పగించవద్దు. దీనిపై పేద, రైతు, పశు కాపర్లు ఇతర వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఈ భూముల్లో టమోటా, వేరుశనగ, కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలి.

-వీవీ రమణ, రైతు సంఘం నేత

ప్రజలు ఏం కావాలి?



మా పంచాయతీ పరిధిలోని కమతంపల్లి, రతినేనాయక్ తండా, బుడ్డయ్యకోట, తులసేనాయక్ తండా, నాయనచెరువుపల్లి, జామ్లానాయక్ తండా గ్రామాల ప్రజలు మల్లిరెడ్డిపల్లి పరిధిలోని గుట్టలపై ఆధారపడి పశువులను పోషించుకుంటున్నారు. అలాంటి భూములను సోలార్‌కు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తాం. ఈ విషయంలో రెవెన్యూ యంత్రాంగం పునరాలోచించాలి. -కాంతమ్మ, సర్పంచ్, గేమేనాయక్‌తండా

ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం

మల్లిరెడ్డిపల్లి పరిధి సర్వే నంబరు 63లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తాం. భూముల అప్పగింతకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు పంపలేదు.

-శోభాసువర్ణమ్మ, తహసీల్దార్, తనకల్లు

నీట్ ప్రశాంతం

2534 మంది హాజరు..

79 మంది గైర్హాజరు


పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు (వివరాలు 7వ పేజీలో...)

పగలే దారి దోపిడీ

• గొర్రెల వ్యాపారి నుంచి రూ.6.80లక్షలు లాక్కెళ్లిన దొంగలు

• ఘటనపై ఎస్పీ సీరియస్

• వివధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు

(వివరాలు 7వ పేజీలో...)

వ్యవహారం ఓపెన్

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు నిరాశాజనకం

సకాలంలో అందని మెటీరియల్

తరగతులు నిర్వహించని అధికారులు

చూచిరాతలకు అభయం.. డబ్బు వసూలు..

కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణతో తగ్గిన ఉత్తీర్ణత


జిల్లా విద్యాధికారి కార్యాలయం

కదిరి అర్బన్, మే 4: ఇటీవల విడుదలైన ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు నిరాశ కలిగించాయి. వివిధ కారణాలతో చదువుకు దూరమైన వారి కోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్ విధానాన్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అధికారుల తీరు, కో-ఆర్డినేటర్ల నిర్లక్ష్యంతోనే ఫలితాలు నిరాశ పరిచాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మార్చిలో సాధారణ టెన్త్, ఇంటర్ పరీక్షలతో పాటుగా ఓపెన్ స్కూల్‌లో అభ్యసించే అభ్యర్థులకు సైతం పరీక్షలను ఒకేసారి నిర్వహించారు. సాధారణ ఫలితాలతోపాటు ఓపెన్ స్కూల్ ఫలితాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. పదోతరగతి పరీక్షలకు 605 మంది హాజరయ్యారు. అందులో 201 మంది (33.22శాతం)మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌లో 1387 పరీక్షలు రాయగా 593 మంది(42.75శాతం) ఉత్తీర్ణులయ్యారు.

సకాలంలో అందని పాఠ్యపుస్తకాలు

ఓపెన్ పదోతరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించి ప్రతి ఏటా సార్వత్రిక విద్యాపీఠం సంస్థ నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఫీజు చెల్లించిన వారికి మెటీరియల్ అందజేస్తుంది. అయితే ఈ ఏడాది సకాలంలో పుస్తకాలు అందలేదని ఆయా కోర్సులకు ఫీజులు చెల్లించిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్చిలో జరిగే పరీక్షలకు గత ఏడాది డిసెంబరులో మెటీరియల్ పంపిణీ చేశారు. దీంతో సిలబస్ పూర్తి కాలేదు. అందుకే ఈ ఫలితాలు వచ్చాయని వాఖ్యానిస్తున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

ఏపీ సార్వత్రిక విద్యాపీఠం అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఈ ఏడాది పూర్తిగా పర్యవేక్షణ వదిలేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ఫలితాలు దిగజారి పోయాయంటూ పలువురు చెబుతున్నారు. విద్యాపీఠం షెడ్యూల్ ప్రకారం నిర్వహించాల్సిన విధులను సైతం నిర్వహించడం లేదని, రాష్ట్రస్థాయి అధికారులూ గాలికి వదిలేశారని కో ఆర్డినేటర్లు చెబుతున్నారు.

వేల రూపాయలు వసూలు

తమ నుంచి వేల రూపాయలు దండుకొని తీరా పరీక్షల సమయంలో మోసం చేశారంటూ కో ఆర్డినేటర్లను పలువురు ప్రశ్నిస్తున్నారు. మిమ్మల్ని పాస్ చేయిస్తాం, మీరు చూసి రాసుకోవచ్చు అంటూ పలు రకాలుగా మభ్యపెట్టి వసూళ్లకు పాల్పడిన విషయంపై పెద్ద ఎత్తున విమర్శల సైతం వచ్చాయి. తీరా పరీక్షలు సాధారణ షెడ్యూల్‌లో పెట్టడం, గట్టిగా నిఘా ఉంచడం, ఎక్కడా మాస్ కాపీయింగ్ అవకాశం లేకుండా చేయటంతో ఉత్తీర్ణత గణనీయంగా పడిపోయిందని పలువురు చెబుతున్నారు.

కానరాని తరగతులు

ఫీజు చెల్లించిన అభ్యర్థులకు ఆయా స్టడీ సెంటర్ల ద్వారా కో ఆర్డినేటర్లు తరగతులను నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లాలో ఎక్కడా అలా జరగలేదు. విద్యాపీఠం అధికారులు ఎక్కడా సరైన పర్యవేక్షణ కాని, పరిశీలన కాని చేసిన దాఖలాలు లేవని పలువురు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. కో ఆర్డినేటర్లు తరగతులు నిర్వహించకుండానే తమ నుంచి వేలాది రూపాయలు దండుకొని రోడ్డున పడేశారని వాపోతున్నారు.

పకడ్బందీగా నిర్వహించాం

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాం. ఎక్కడా కూడా మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. దీంతో ఉత్తీర్ణతా శాతం గతేడాదితో పోల్చుకుంటే తగ్గింది. ఈ ఏడాది ప్రభుత్వం ఓపెన్ పరీక్షల నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

-లాజర్, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్


భవన నిర్మాణ కాలనీలో నిర్మించిన భవనాలు

న్యాయం కోసం..

భవన నిర్మాణ కార్మికుల నిరీక్షణ

పట్టాలు అమ్ముకున్న ఓ నాయకుడు

అక్రమాలు తేలినా చర్యలు శూన్యం

కాలనీలో యథేచ్ఛగా నిర్మాణాలు

కదిరి, మే 4(ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం భవన నిర్మాణ కార్మికులు ఎదురు చూస్తున్నారు. పట్టణంలో తమకు ఇచ్చిన ఇంటి పట్టాలను ఓ కార్మిక నాయకుడు అమ్ముకుంటూ, అన్యాయం చేస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల విచారణలో అక్రమాలు నిజమని తేలినా చర్యలు తీసుకోవడంలో జాప్యంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్మిక నాయకుడు అధికార పార్టీకి చెందిన వాడు కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు జంకుతున్నట్లు సమాచారం. కాగా భవననిర్మాణ కాలనీలో జరిగిన అక్రమాలపై 24 గంటల్లో నివేదిక ఇవ్వాలని మార్చి 5న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. దాదాపు రెండు నెలలు గడుస్తున్న అక్రమార్కులపై ఎటువంటి చర్యలు లేకపోవడం గమనార్హం.

అక్రమార్కులపై చర్యలు ఎప్పుడు?

కదిరి - హిందుపురం రహదారిలో ప్రస్తుత ఆర్డీఓ కార్యాలయం ఎదుట 2007సంవత్సరంలో సర్వే నెంబర్ 1769, 70లలో 323 మంది భవన నిర్మాణ కార్మికులకు ఇంటి పట్టాలు ఇచ్చారు. అయితే పట్టాలు కార్మికుల చేతికి ఇవ్వకుండా ఓ కార్మిక నాయకుడు తన వద్దే ఉంచుకున్నాడు. ఎవరు డబ్బు ఇస్తే వారికి పేర్లు మార్చి నకిలీ పట్టాలు ఇచ్చాడు. ఈకాలనీకి ఎదురుగా ఆర్డీఓ కార్యాలయంతో పాటు డీఎస్పీ కార్యాలయాలు ఏర్పాటు చేయడం, టిడ్కో ఇళ్ల నిర్మాణం జరగడంతో భవన నిర్మాణ కాలనీలో పట్టాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ఆ కార్మిక నాయకుడు ఇంటి పట్టాలను రూ.లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నాడు. మొత్తం 323 పట్టాలు లే అవుట్‌లో ఉంటే ప్రస్తుతం ఈ కాలనీలో 500లకు పైగా బేస్‌మెంట్‌లు, ఇళ్లు ఉన్నట్లు అధికారులు విచారణలో తేలినట్లు సమాచారం. ప్రస్తుతం ఈకాలనీలో 10 శాతం మాత్రమే అర్హులైన వారు ఉన్నట్లు తెలిసింది. మిగతావన్ని ఆ కార్మిక నాయకుడి సృష్టేనని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఈకాలనీపై చేసిన విచారణ నివేదికను 10 రోజుల కిందట కలెక్టర్‌కు పంపినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. మరి చర్యలు ఎప్పుడు తీసుకుంటారోనని అర్హులైన కార్మికులు ఎదురుచూస్తున్నారు.

కార్మికులకు న్యాయం జరిగేనా?

భవన నిర్మాణ కాలనీలో 323 మంది కార్మికుల పేర్లతో పట్టాలు మంజూరయ్యాయి. వారిలో కొంత మందికి మాత్రమే స్థలాలు చూపించా రు. మిగత వారికి పట్టాలు అందలేదు. స్థలాలు చూపలేదు. తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న పేర్లను చూసి తమకు పట్టాలు మంజూరు అయ్యినట్లు కార్మికులు తెలుసుకున్నారు. అయితే ఆ పట్టాలు ఎక్కడ ఉన్నాయో కార్మికులకు అంతు పట్టలేదు. అయితే తమకు కేటాయించిన స్థలాల్లో ఇతరులు నిర్మాణాలు చేపట్టారు. ఇదేమని ప్రశ్నిస్తే పట్టాలు చూపిస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు. మాపేరున ఉండే పట్టాలు మీకు ఎలా ఇచ్చారని ప్రశ్నిస్తే కార్మిక నాయకుడు ఇచ్చినట్లు వారు చెబుతున్నారని కార్మికులు వాపోతున్నారు. అర్హులైన తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

యథేచ్ఛగా నిర్మాణాలు

భవన నిర్మాణ కాలనీలో అక్రమాలు జరిగిన క్రమంలో విచారణ కొనసాగుతోంది. విచారణ పూర్తి అయ్యేంతవరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని అధికారులు పట్టాదారులను ఆదేశించారు. అయినా వాటిని పెడచెవిన పెట్టి కొంతమంది నిర్మాణాలు చేపట్టినట్లు తెలిసింది. అర్హులైన కార్మికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లినట్లు చెబుతున్నారు. వాటిని పరిశీలించి నిర్మాణాలను ఆపుతామని అధికారులు చెప్పినట్లు కార్మికులు చెబుతున్నారు.

నివేదిక కలెక్టర్‌కు సమర్పించాం

భవన నిర్మాణ కాలనీలో అక్రమాలు జరిగినట్లు, వాటిపై విచారణ చేయాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అమేరకు ప్రత్యేక టీంతో విచారణ చేశాం. విచారణ నివేదిక కలెక్టర్ సమర్పించాం. దానిపై తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

-వీవీఎస్ శర్మ, ఆర్డీఓ, కదిరి

కర్బూజ రైతుకు న్యాయం చేస్తాం


ఎలుగుబంట్ల దాడితో దెబ్బతిన్న కర్బూజ పంటను పరిశీలిస్తున్న అధికారులు

మడకశిర రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): ఎలుగుబంట్లు దాడిలో కర్బూజ పంట నష్టపోయిన రైతుకు పరిహారం విషయంలో న్యాయం చేస్తామని అటవీశాఖ అధికారి విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని ఆమిదాలగొంది గ్రామ రైతు నాగభూషణరెడ్డి సాగుచేసిన కర్బూజ పంటపై మూడు రోజుల క్రితం ఎలుగుబంట్లు దాడి చేసి, ధ్వంసం చేశాయి. దీంతో రైతు తీవ్రంగా నష్టపోయాడు. అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ అధికారి ఒకరోజు ఆలస్యంగా పొలాన్ని పరిశీలించి, ఎలుగుబంట్లు దాడి చేసినట్లు ఫొటోలుగానీ, ఆధారాలుగానీ ఉంటేనే పరిహారానికి సిఫార్సు చేస్తామని చెప్పుకొచ్చారు. దీంతో రైతు తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. రాత్రి సమయంలో ఎలుగుబంట్లు దాడి చేశాయనీ, ఆ సమయంలో ఫొటో ఎలా తీయగలమని వాపోయాడు. రైతు దుస్థితిపై 'ఎలుగుబంట్ల ఫొటోలుంటేనే పరిహారం..!' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఆదివారం కథనం ప్రచురించింది. ఇది జిల్లా అధికారుల్లో చలనం తెచ్చింది. అటవీశాఖ అధికారి విజయభాస్కర్, పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఉద్యాన అధికారి మమతశ్రీ రైతు నాగభూషణరెడ్డితో కలిసి కర్బూజ పంటను పరిశీలించారు. పరిహారం అందించి, న్యాయం చేస్తామని రైతుకు భరోసా ఇచ్చారు. దీంతో రైతు ఆనందం వ్యక్తంచేశారు.

పద్మభూషణుడికి సన్మానం.. పులకించిన పురం..!

- ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘనంగా పౌరసన్మానం
- కిక్కిరిసిన పురం రోడ్లు
- 20వేల మందికిపైగా హాజరు

హిందూపురం, మే 4(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ అవార్డు గ్రహీత ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు పట్టణంలో ఆదివారం ఘన సన్మానం చేశారు. పద్మభూషణ్ అవార్డు అందుకుని మొదటిసారిగా హిందూపురం వచ్చిన ఎమ్మెల్యే బాలకృష్ణకు టీడీపీ నాయకులు, అభిమానులు, నియోజక వర్గ ప్రజలు పౌరసన్మానసభ ఏర్పాటు చేశారు. ఆదివారం ఎంజీఎం క్రీడా మైదానంలో అంగరంగ వైభవంగా కార్యక్రమం జరిగింది. నియోజకవర్గం తోపాటు జిల్లా, కర్ణాటక నుంచి 20వేల మందికిపైగా జనం వచ్చారు. ఎంజీఎం క్రీడామైదానం నిండిపోయి రోడ్లపైనే జనం ఆగిపోయారు. ఈ సందర్భంగా పలువురు గాయకులు పాటలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో చూపరులను కట్టిపడేశారు. ఈ సందర్భంగా నాయకుల, అభిమానులు ప్రత్యేకంగా వెండితో తయారు చేయించిన సింహాసనం, గద, కత్తి, పిల్లనగోవి, కిరీటాన్ని బాలయ్యకు బహూకరించారు.

గుర్రాల రథంపై ఊరేగింపు

మొదట రహమత్‌పురం సర్కిల్ చేరుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సెంట్రల్ లైటింగ్ సిస్టంను ప్రారంభించారు. అక్కడి నుంచి గుర్రాల రథంపై ఎంజీఎం క్రీడా మైదానానికి సతీమణి వసుంధరాదేవితో కలిసి వస్తుండగా నాయకులు, అభిమానులు భారీ గజమాలతో స్వాగతం పలికారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

ఈ సత్కారం మరచిపోలేనిది..



సభావేదికపై ఎమ్మెల్యే బాలకృష్ణ మాట్లాడుతూ.. జీవితంలో ఈ సత్కారం మరిచిపోలేనిదన్నారు. ఎప్పటికీ హిందూపురాన్ని తమ కుటుంబం మరిచిపోదన్నారు.

అపర భగీరథుడు.. బాలయ్య..

బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ.. హిందూపురం ప్రాంత ప్రజల దాహార్తి తీర్చడానికి గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేసిన అపర భగీరథుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అని కొనియాడారు. రాజకీయ, సినీరంగాల్లో ఎందరికో అండగా నిలుస్తున్నారన్నారు. ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ.. హిందూపురం టీడీపీ కంచుకోట అన్నారు. ప్రజల అభిమానం బాలకృష్ణపై ఎప్పటికీ ఉంటుందన్నారు. తాగు, సాగునీరు ఆసుపత్రి అభివృద్ధి ఆయనకే సాధ్యమన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రియల్ హీరో బాలకృష్ణ అన్నారు. ఆయన ఎవరికి ఆపద వచ్చినా అండగా నిలుస్తారన్నారు. ఆయన చేస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జిల్లాలో ఎమ్మెల్యేగా ఉండటం అందరి అదృష్టమన్నారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ.. బాలకృష్ణ తండ్రి వారసత్వాన్ని పునికి పుచ్చుకుని సినీరంగంలో రాణిస్తూ మూడుసార్లు ఎమ్మెల్యేగా సేవలందిస్తున్నారన్నారు. ఆయనకు ఆయనే సాటి అన్నారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి మాట్లాడుతూ.. బాలకృష్ణ అభిమానం, ఆయన చేసే సేవ కళ్లారా చూశామన్నారు. తన అత్తకు ఆరోగ్యం బాగలేనపుడు ఆయన చూపిన ప్రేమ, చేసిన సేవ ప్రశంసనీయమన్నారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ.. హిందూపురంలో ఒకప్పుడు రూ.10 బిందె నీరు కొనాల్సి వచ్చేదనీ, బాలయ్య పుణ్యమా అంటూ సాగు, తాగునీరు కృష్ణాజలాలను అందిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి మాట్లాడుతూ.. సినీరంగంలో బాలకృష్ణకు సాటి ఎవరూ లేరన్నారు. ఆయన డైలాగులు వింటేనే సినిమా ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మెన్ అనిల్‌కుమార్, రావిళ్ల లక్ష్మి, నాయకులు నాగరాజు, బేవనహళ్లి ఆనంద్‌కుమార్, మంగేష్, వెంకటేశ్, అమర్నాథ్, చంద్రమోహన్, పరిమళ తదితరులు పాల్గొన్నారు.



వెండి నామాల జ్ఞాపికను అందజేస్తున్న పట్టణ నాయకులు



మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలతో బాలకృష్ణ దంపతులు

క్రైం కార్నర్

పోటీ పరీక్షలకు వెళ్తూ... గాయపడిన విద్యార్థిని



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయివర్షిణి

కొత్తచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తిలోని సాయినగర్‌కు చెందిన గంగాద్రి కుమార్తె సాయివర్షిణి పోటీ పరీక్షలకు వెళ్తూ ప్రమాదానికి గురైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు సాయివర్షిణి సత్యసాయి యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. అనంతపురంలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వయం కాంపిటేటివ్ పరీక్ష రాయడానికి తండ్రితో కలిసి ఆర్టీసీ బస్సులో వెళ్తోంది. అయితే కొత్తచెరువులోకి ఆర్టీసీ బస్సురాగానే ఆ విద్యార్థిని చెయ్యి విండో పక్కపెట్టుకుంది. రోడ్డుకు అడ్డంగా కారు ఉండటంతో కుడిపక్కకు బస్సు వెళ్లింది. ఈ సమయంలో కనకదాసు విగ్రహానికి విద్యార్థిని చెయ్యి బలంగా తగిలింది. దీంతో చెయ్యి నుజ్జునుజ్జుఅయింది. వెంటనే తండ్రి, స్థానికులు హుటాహుటిన సూపర్ స్పెషల్ ఆస్పత్రికి ఆటోలో తరలించగా అక్కడ ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ముగ్గురు బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

- రూ.4.02 లక్షల నగదు.. మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం




అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె, మే 4(ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ మ్యాచ్‌లపై బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన శ్యామల రాజశేఖర్, శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన పెమ్మక సుధీర్‌రెడ్డి, పెమ్మక భాస్కర్‌రెడ్డి జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో బెట్టింగ్‌ను ఎంచుకున్నారు. యువకులను బెట్టింగ్ ఊబిలోకి దించుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఐపీఎల్ మ్యాచ్‌లపై భారీగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో శింగనమల సీఐ కౌలుట్లయ్య ఆధ్వర్యంలో గార్లదిన్నె, శింగనమల ఎస్‌ఐలు మహ్మద్ గౌస్, విజయ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుళ్లు అంజన్‌రెడ్డి, కృష్ణ, నాగేష్, దివాకర్, నరేష్, వెంకటేష్, అమర్నాథ్ ఆదివారం ఉదయం కల్లూరులో రాజశేఖర్ ఇంటి వద్ద సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4.02 లక్షలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పగలే దారి దోపిడీ

- గొర్రెల వ్యాపారి నుంచి రూ.6.80లక్షలు లాక్కెళ్లిన దొంగలు
- ఘటనపై ఎస్పీ సీరియస్
- వివధ కోణాల్లో పోలీసుల దర్యాప్తు



బాధితుడు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని చెరువు సమీపం ఉప్పరపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో ఆదివారం పట్టపగలే దారి దోపిడీ జరిగింది. గొర్రెల వ్యాపారి చెరుకూరి నారాయణస్వామి వద్ద నుంచి గుర్తుతెలియని దుండగలు రూ.6.80 లక్షలు లాక్కెళ్లిన ఘటన చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన నారాయణస్వామి గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అనంతపురం రూరల్ ఉప్పరపల్లి గ్రామంలో గొర్రెల వ్యాపారి వద్ద నుంచి గొర్రెలు కొనుగోలు చేసేందుకు రూ.6.80లక్షల నగదును ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. చెరువు గట్టు పక్కనే ఉన్న రోడ్డు నుంచి ఉప్పరపల్లి గ్రామానికి వెళుతున్నాడు. రోడ్డు మధ్యలో ముళ్ల పొదల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి టూవీలర్ ఆపి, వ్యాపారిని కొట్టి అతని వద్ద నుంచి రూ.6.80లక్షలను లాక్కెళ్లారు. నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు హిందీలో మాట్లాడుతున్నారని బాధితుడు తెలిపాడు. వ్యాపారం నుంచి వచ్చిన డబ్బులు అన్నీ పోగుచేసి గొర్రెలు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా ఇలా జరిగిందని బాధితుడు వాపోయాడు. విషయాన్ని వెంటనే బాధితుడు బంధువులకు తెలపడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని దొంగలు కోసం గాలించారు. అప్పటికే వారు పరారీ అయ్యారని తెలిపారు. దోపడీ జరిగిన విషయాన్ని వెంటనే బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్పీ జగదీష్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కేసును త్వరితగతిన ఛేదించాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లును ఆదేశించినట్లు తెలిసింది. బాధితుడితో డీఎస్పీతో పాటు ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్, బీకేఎస్ సీఐ పుల్లయ్య, సీసీఎస్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి సంఘటనపై ఆరా తీశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.



బాధితుడి బంధువులతో ఆరాతీస్తున్న అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు

రేపు మెగా జాబ్‌మేళా

ముదిగుబ్బ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల, ఇబ్రహీం పట్నం ఐటీఐ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాళ్లు శివారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకర్ ఆదివారం ఒక పత్రికటనలో తెలిపారు. జాబ్ మేళాకు ఏదైనా డిగ్రీ, ఐటీఐ చదివినవారు అర్హులన్నారు. శ్రీసిటీకి చెందిన టీవీఎస్, టీఎస్ కంపెనీలు ఈ నెల 6వ తేదీ ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, వివరాల కోసం 9959890237, 9059282875, 9014219369 నంబర్లను సంప్రదించాలన్నారు.

వివాదాలు లేకుండా టీచర్ల బదిలీలు చేపట్టాలి

- ఎమ్మెల్సీకి పీఆర్టీయూ నేతల వినతి

అనంతపురం విద్య, మే 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీచర్ల బదిలీలు ఎలాంటి వివాదాలకు తావు లేకుండా జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును ఉపాధ్యాయ సంఘాల నేతలు కోరారు. ఆదివారం అనంతపురం వచ్చిన ఎమ్మెల్సీని పీఆర్టీయూ నేతలు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు కలిశారు. వారు మాట్లాడతూ సెలవుల్లోనే టీచర్ల బదిలీలు త్వరగా జరిగేలా చూడాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నిష్పత్తి తగ్గించేలా చూడాలన్నారు. వేసవి సెలవుల్లో ప్రత్యేక క్లాసులకు హాజరయ్యే టీచర్లకు ఈఎల్స్ మంజూరయ్యేలా చూడాలని కోరారు. డీఈఓ పూల్‌లో ఉన్న లాంగ్వేజ్ పండిట్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఉర్దూ స్కూళ్లలో తెలుగు పోస్టు కొనసాగించాలన్నారు. ఎలాంటి కోర్టు వివాదాలకు తావు లేకుండా బదిలీలు నిర్వహించేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం ఎమ్మెల్సీకి వినతిపత్రం అందించారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రధానకార్యదర్శి తిమ్మారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, చితంబర్‌రెడ్డి, శివారెడ్డి, బాబయ్య, శ్రీరాములు, చంద్రశేఖర్, జగన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

ప్రైవేట్ యూనియన్ నేతల వినతి...

ఎమ్మెల్సీ గాదెను అపుస్మా నాయకులు కలిశారు. వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12.1(సీ)కి సంబంధించిన సమస్యలను, ఇతర విషయాలను ఎమ్మెల్సీకి వివరించారు. అనంతరం వినతిపత్రం ఇచ్చారు. నాయకులు పుల్లారెడ్డి, నాయుడు, సుబ్బారెడ్డి, రవిశంకర్ ప్రసాద్, నాగరాజు, మహమ్మద్ ఇక్బాల్, కరుణాకర్ పాల్గొన్నారు.

గౌస్‌మొద్దీన్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు



గౌస్‌మొద్దీన్‌కు స్వీట్ తినిపిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

అనంతపురం అర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బాలకృష్ణ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్‌కు సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం హిందూపురంలోని రక్షా అకాడమిలో బాలకృష్ణను గౌస్ కలిశారు. గౌస్‌మొద్దీన్‌కు బాలకృష్ణ స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి గౌస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం: ఎమ్మెల్సీ

పుట్టపర్తి, మే 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆదివారం ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయనకు సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు రూ.6కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. త్వరలో రెండో విడత నిధులను విడుదల చేయనుందన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు పీవీ రమణారెడ్డి, సురేశ్‌బాబు, రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజనేయులు, రజనీకాంత్‌రెడ్డి, సౌదామిని, నారాయణస్వామి పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా నాలుగోసారి శంకర్‌నారాయణ

అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ట్రెజరీ భవనంలో సమావేశం నిర్వహించారు. ఏపీ ట్రెజరీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకులుగా కిరణ్‌కుమార్, రవికుమార్, ఏపీ ఎన్జీఓ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రమోహన్ వ్యవహరించారు. సంఘం అధ్యక్షుడిగా శంకర నారాయణ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఫరూక్‌మహ్మద్, ఉపాధ్యక్షులుగా సుమనలత, జగదీష్, శ్రీనివాసరావు, వాసుమూర్తి యాదవ్, కార్యదర్శిగా మహేశ్వరరెడ్డి, సహాయ కార్యదర్శులుగా సాదిక్ ఖానం, శ్రీనివాసులు, రాజేష్, కోశాధికారిగా అనంతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు తిరుమలరెడ్డి, కిశోర్ కుమార్ చౌదరి, ఉమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రెజరీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఉద్యోగులకు అనుకూలంగా ఉండే కూటమి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని నూతన కార్యవర్గం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏటీఓ రాణి, ఏపీఎన్జీఓ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, జడ్పీ ఆడిట్ ఉద్యోగుల సంఘం దస్తగిరి, ఆర్‌అండ్‌బీ శ్రీధర్, అగ్రికల్చర్ ఉద్యోగుల సంఘం, డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియం అసోసియేషన్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

మోదీ.. చంద్రబాబుతోనే వర్గీకరణ సాకారం

- మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ సభలో ఎంఎస్ రాజు

అనంతపురం సెంట్రల్, మే 4(ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలాలు వర్గీకరణ రూపంలో మాదిగ జాతికి అంకితమనీ, ఇది కేవలం ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడుతోనే వర్గీకరణ చట్టం రూపుదాల్చిందని ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, జయసూర్య, గిత్తా దస్తగిరి అన్నారు. ఆదివారం మాసినేని గ్రాండ్‌లో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో మాదిగ ఎమ్మెల్యేల ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఎంఈఎఫ్ జాతీయ అదనపు కార్యదర్శి బండారు శంకర్ అధ్యక్షతన నిర్వహించిన సభకు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే గుత్తా జయసూర్య, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం 30 సంవత్సరాలు ఉద్యమాన్ని నడిపిన స్ఫూర్తిదాత మందకృష్ణ మాదిగ అని పేర్కొన్నారు. 1999 నుంచి 2004వరకు టీడీపీ ప్రభుత్వంలో తొలిసారిగా చంద్రబాబు వర్గీకరణ అమలుచేశారన్నారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ ఇలా ఒక్కో పార్టీతో ఒక్కోసారి కలిసి మీటింగ్‌లు పెడతారని మందకృష్ణ మాదిగను విమర్శించారన్నారు. రాజ్యాధికారంలోకి వచ్చే పార్టీలతో స్నేహ హస్తం చాటాల్సిన సందర్భాల్లో చేయిచాచడని, యుద్ధం చేయాల్సిన సమయంలో యుద్ధం చేశాడన్నారు. శింగనమల ఎమ్మెల్యే కావాలని బండారు నారాయణస్వామి దాదాపు 20సంవత్సరాలు పోరాటం చేశారన్నారు. ఆదేస్ఫూర్తితో మనవరాలిగా బండారు శ్రావణిశ్రీ నిలబడి ఎమ్మెల్యేగా కలను సాకారం చేసిందన్నారు. అనంతరం కల్యాణదుర్గం ఎంఈఎఫ్ బృందం పాటలు పాడారు. వివిధ ప్రాంతాలనుంచి తరలివచ్చిన వారితో ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించి సత్కరించారు. అదేవిధంగా ఎంఎస్ రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌ను కట్‌చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సైదన్న, డాక్టర్ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ భాస్కర్‌బాబు, డాక్టర్ మహేష్‌బాబుతోపాటు ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ శ్రీనివాసరావు, రాష్ట్ర అధ్యక్షుడు బిక్షాలు, ఉపాధ్యక్షులు గంగాధర్, నాయకులు సాకే అమర్నాథ్, నాగేంద్రనాథ్, రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణిశ్రీ, జయసూర్య, గిత్తా దస్తగిరిని సన్మానిస్తున్న దృశ్యం

నీట్ ప్రశాంతం



పరీక్ష హాల్‌లోకి వెళ్తున్న అభ్యర్థులు

అనంతపురంటౌన్, మే 4 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ విద్యలో ప్రవేశం కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీట్ పోటీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం జిల్లాకేంద్రంలోని ఆరు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 2,613 మంది అభ్యర్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, పరీక్షకు 2,534 మంది హాజరయ్యారు. 79 మంది గైర్హాజరైనట్లు కలెక్టరు తెలిపారు. పరీక్షల నిర్వహణ పగడ్బందీగా కొనసాగించారు. అభ్యర్థులను పక్కాగా పరిశీలించిన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతించారు. కలెక్టరు వినోద్‌కుమార్ పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు. మొత్తం మీద నీట్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

రెండోరోజూ కొనసాగిన గ్రూప్-1 పరీక్షలు

యుపీఎస్సీద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు రెండోరోజు కొనసాగాయి. ఆదివారం పీవీకేకే ఇంజనీరింగ్ కాలేజ్, శ్రీబాలాజీ పీజీ కాలేజ్‌లలో పరీక్షలు కొనసాగాయి. 594మంది అభ్యర్థులు హాజరకావాల్సి ఉండగా 384మంది మాత్రమే హాజరై పరీక్షలు రాశారు. 210మందిఅ గైర్హాజరైనట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఏడాది 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శంకరయ్య మాట్లాడుతూ ప్రతి ఏడాది రాయలసీమ బలిజమహాసంగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో 550పైబడి మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన బలిజ విద్యార్థులు టీసీ, ఆధార్ కార్డు, ఎస్‌ఎస్‌సీ మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, రెండు పాస్ ఫొటోలతో 27వ తేదీలోపు శ్రీనివాస్‌నగర్‌లోని బాలాజీ కళ్యాణమండపానికి పోస్ట్ ద్వారా లేదా నేరుగా అందజేయాలన్నారు. జూన్ 1న ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9866419693, 9490180177 నంబర్లను సంప్రదించాలన్నారు.

కనకదాస ప్రతిభా పురస్కారాలకు..: శ్రీ కనకదాస విద్య, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో అందించే ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మర్రిస్వామి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన ఉమ్మడి అనంత జిల్లాలోని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 11వ తేదీన గుత్తి రోడ్డులోని కనకదాస కల్యాణమండపంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారన్నారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 8500237622, 9704515484 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొత్తచెరువు: బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారానికి 8వ తేదీలోగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం వ్యవస్థాపకుడు కటిక జయరాం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వపాఠశాలల్లో చదివి పదో తరగతిలో 540పైగా మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అర్హులన్నారు. ఈ పురస్కారాలను ఏపీ ఎస్సీ, ఎస్టీ ట్రైబల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అందిస్తారన్నారు. మరిన్ని వివరాలకోసం 94407 05369, 94916 63388 నంబర్లను సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలో ఆర్డీటీ ఎంతో మంది ప్రాణాలను కాపాడిందన్నారు.

రేపట్నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు, మే4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 14వతేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు కందికేరి మనోహర్, నాగరాజు, నటరాజ్, పణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న ధ్వజారోహణం, 7న హంసవాహనం, 8న భృంగి, 9న శేషవాహనం, 10 నందివాహనం, 11న పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం, 12న మడుగుతేరు, 13న పారాటోత్సవం, 14న వసంతోత్సవం, పుష్పయాగం, ఊంజల్ సేవతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కదిరిఅర్బన్, మే 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టబోయే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను పెట్టుబడి దారులకు దోచిపెట్టడానికి మోడీ ప్రభుత్వం చట్టాలను సవరించిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, జగన్మోహన్, రామమోహన్, ముస్తాక్, బాబ్‌జాన్, ఉదయ్, అంజనేయులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వబాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇందులో 98 మందికి పరీక్షలు నిర్వహించగా 41 మంది ఆపరేషన్‌కు ఎంపికయ్యారని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర తెలిపారు. కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంపు చైర్మన్ కల్యాణ్ చక్రవర్తి, సభ్యులు సుబ్బారావు, చాంద్‌బాషా, రామాంజి, జయంతి, వినోద్‌కమార్ పాల్గొన్నారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ముదిగుబ్బ, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతవూరిలోని గ్రామదేవతలు పెద్దమ్మ, మంటలమ్మ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవార్లకు వెండి ఆభరణాలు, వేప మండలు, బంతిపూలు, మల్లెపూలతో అలంకరించి, పూజలు నిర్వహించినట్లు పూజారులు పెద్దన్న, శివసాయి తెలిపారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం, చీరలు, గాజులు, పసుపు కుంకుమ సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు.

రేపు ఉపాధ్యాయుల సమస్యలపై ధర్నా

కదిరిఅర్బన్, మే 4(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు ఆ నాయకులు ఆది బయ్యన్న, నారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలన్నారు.

మృతులకు నివాళి

నల్లమాడ, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని టీడీపీ కార్యకర్తలు బాను, మౌలాలి అనారోగ్యంతో ఆదివారం మరణించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి నివాళులర్పించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గాండ్లపెంట, మే 4(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాని ఆర్వీఎస్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆనంద్ పోస్టుకార్డుల ఉద్యమం ఆదివారం నిర్వహించారు. ఆదివారం మండలంలోని మద్దివారిగొంది, రెక్కమాను, గాండ్లపెంట తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మేకల శివప్రసాద్, ఆదిబయ్యన్న, శంకర్, శివయ్య, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

తనకల్లు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వివిధ బ్యాంక్‌లో రుణాలకు ఈనెల 10లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పూల రెడ్డెప్ప కోరారు. దరఖాస్తు ఒక కాపీని ఎంపీడీఓ కార్యాలయంలో అందచేయాలన్నారు. యూనియన్ బ్యాంక్ పరిధిలో ఎనిమిది మందికి, స్టేట్ బ్యాంక్ పరిధిలో పది మందికి, ఏపీజీబీ బ్యాంక్ పరిధిలో తొమ్మది మందికి రుణాలు మంజూరు చేస్తామన్నారు.

అగ్రిగోల్డ్ ఏజెంట్ మృతి

కొత్తచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్డె వీధిలో నివాసం ఉంటున్న అగ్రిగోల్డ్ సీనియర్ ఏజెంట్ నమస్తే వెంకటరమణ (72) అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరమణ గతంలో అగ్రిగోల్డ్ ఏజెంటుగా ప్రజలతో డబ్బులు కట్టించారు. అనంతరం అగ్రిగోల్డ్ సంస్థ బోర్డు తిప్పివేయడంతో డబ్బులు కట్టిన ప్రజలు.. డబ్బులు ఇవ్వాలని అతనిపై ఒత్తిడి చేసేవారు. దీంతో మానసిక ఒత్తిడితో అనారోగ్యానికి గురయ్యాడు. మూడు రోజులుగా అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, కూతురు పుష్ప, కుమారుడు గోవిద్ ఉన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల క్రితం వచ్చిన గాలివానకు దాదాపు 1000 ఎకరాలలో మామిడి పంట దెబ్బతిందని, ఆ రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రైతుసంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... మామిడి పంట గాలివానకు నేలరాలి లక్షలాది రుపాయిలు నష్టపోయారన్నారు. వెంటనే ఉద్యానవన అధికారులు జిల్లా వ్యాప్తంగా పంట నష్టాన్ని అంచనా వేసిఆ రైతులను ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు మారుతి, సీఐటీయూ ఎస్‌హెచ్‌బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

క్రీడలకు నిధులు



- నిధుల మంజూరుకు ప్రభుత్వం చర్యలు
- వెబ్‌సైట్‌లో నమోదుకు ఆదేశాలు

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసం ఏ ఏ పాఠశాలలకు ఏఏ క్రీడాపరికరాలు అవసరమో పాఠశాలల వారీగా అంచనాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించింది. వాటిని పరిశీలించి స్పోర్ట్స్ కిట్లకు అవసరమైన నిధులు మంజూరు చేయనుంది.

● వైసీపీ నిర్లక్ష్యం

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు ఏటా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసేంది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దానికి బ్రేక్ పడింది. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం క్రీడలను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పాఠశాలలకు క్రీడా కిట్లను పంపిణీ చేయలేదు. దీంతో ఆసక్తి ఉన్న చాలా మంది విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. వైసీపీ ప్రభుత్వం చివరి ఏడాది పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను సరఫరా చేసింది. ఆడుదాం-ఆంధ్ర పేరుతో పోటీలను నిర్వహించి .. చేతులు దులుపుకుంది. కాగా ఈ స్పోర్ట్స్ కిట్లు చాలా నాసిరకంగా ఉండటంపై పలు అవినీతి ఆరోపణలు వచ్చాయి. క్రీడాకారులు కూడా ఈ పోటీల పట్ల పెద్దగా ఆసక్తి చూపలేదు. నిర్వాహణకు నిధులు లేకపోవడంతో క్రీడా మైదానాలూ అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

● ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2098 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 1,48,453 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, క్రికెట్‌కు సంబంధించి స్పోర్ట్స్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా మైదానాలకు మరమ్మత్తులు చేయడానికి సిద్ధమైంది. ఇందుకు కావాల్సిన నిధులను పాఠశాలల వారీగా వెబ్‌సైట్‌లో అంచనాలను నమోదు చేస్తే.. వాటిని పరిశీలించి మంజూరు చేయనుంది.

అంచనాలను పంపండి



ప్రస్తుత ప్రభుత్వం పాఠశాలలో క్రీడలను ప్రోత్సహించడానికి నిధులు కేటాయిస్తోంది. జిల్లాలోని పాఠశాలలోని పీఈటీలు, పీడీలు ఏఏ క్రీడాపరికరాలు అవసరమో అంచనాలను సిద్ధం చేసుకొని.. వాటిని ప్రభుత్వం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. వాటిని పరిశీలించి కిట్లకు సంబంధించి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు మంజూరు చేస్తుంది.

-మురార్జీ యాదవ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధికారి

ప్రమాదాలకు నిలయాలుగా మారిన విగ్రహాలు

నిద్రమత్తులో ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీసులు

కొత్తచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నడి రోడ్లపై ఏర్పాటు చేసిన కులబాంధవుల విగ్రహాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇలా రోడ్ల మధ్యలో విగ్రహాలను ఏర్పాటు చేయడంతో పాటు ఆ విగ్రహాల చుట్టూ స్టేజిలాగా ఏర్పాటు చేయడం ప్రమాదాలకు కారణం అవుతోంది. ముందుగానే చిన్న రోడ్లు.. ఆపై ట్రాఫిక్.. రోడ్లకు ఇరువైపులా నిలిపిన వాహనాలు.. వీటిని దాటి బస్సులు.. ఇతర వాహనాలు రావడం సమస్యగా మారుతోంది. దీనిపై పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పుట్టపర్తిలోని సాయినగర్‌కు చెందిన గంగాద్రి కుమార్తె సాయివర్షిణి ఆదివారం పుట్టపర్తి నుంచి అనంతపురానికి బస్సులో వెళ్తూ.. కనకదాసు విగ్రహానికి తగిలి తన కుడి చేతిని పొగొట్టుకుంది. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదానికి కారణమైన విగ్రహ నిర్మాణం →

పూర్వ విద్యార్థుల సమావేశం



గాండ్లపెంట, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. నాటి గురువులకు సన్మానించారు.

← నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించి.. బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ముందుగా స్వామివారికి ప్రాతఃకాల సమయాన అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమంలో భాగంగా అంకురార్పణ, నవకుంబస్థాపన, గరుడ ప్రతిష్ట కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నంశెట్టి జగదీశ్, ఈఓ వెంకటేశులు, అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయయ, భక్తులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా

గాండ్లపెంట, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని చిన్నమిట్ట వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం బోల్తాపడిన ప్రమాదంలో ఆటోడ్రైవర్ మారుతీ ప్రసాద్ మరణించిన విషయం తెల్సిందే. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆదివారం పరామర్శించారు. ప్రసాద్ కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రసాద్ ఇద్దరు కుమారులను చదివిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కన్వీనర్ కొండయ్య, సర్పంచ్ రహంతుల్లా, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, అక్రమ్‌బాషా, ఆనంద్, శివ, నరసింహులు ఉన్నారు.

రక్షణ గోడలు ఏర్పాటు చేయండి

తాడిమర్రి, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లోని ప్రధాన రహదారులలో కాలువలపై నిర్మించిన వంతెనలకు రక్షణ గోడలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పీఏబీఆర్ కుడికాలువ మీద నిడిగల్లు వద్ద, బత్తలపల్లి-పులివెందుల రహదారిపై, పీఏబీఆర్ కుడికాలువపై, ఏకపాదం పల్లి వద్ద, బత్తలపల్లి-తాడిపత్రి రాష్ట్ర రహదారిపై వంతెనలకు రక్షణ గోడలు లేవు. గతంలో జరిగిన ప్రమాదాల సమయంలో రక్షణ గోడలు కూలిపోవడం, అడ్డుగా ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు దెబ్బతినడంతో రక్షణ కరువైంది. ఈ రహదారులపై నిత్యం వందలాద వాహనాలు తిరుగుతుంటాయి. వాహనదారులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా.. వాహనాలు కాలువలోకి దూసుకుపోయి.. ప్రాణనష్టం జరిగే ప్రమాదముంది. ఇదే దారిపై అధికారులు నిత్యం వెళ్తున్నా.. ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



▲ తాడిపత్రి జాతీయ రహదారిలో రక్షణ గోడలేని కాలువ కల్వర్టు

నిడిగల్లు వద్ద దెబ్బతిన్న రక్షణ గోడ ▼



చౌటకుంటపల్లిలో నీటి ఎద్దడి

- బోరుబావుల్లో అరకొరగా నీరు
- వాటర్‌మన్ లేక కొన్ని వీధులకే సరఫరా

నల్లమాడ, మే 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటకుంటపల్లి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ హయాంలో బోరుబావి నుంచి నేరుగా తాగేనీటిని పట్టుకునేవారు. అంతేకాకుండా ఆ బోరుబావి నీటితో సమీపంలోని పశువుల నీటి తొట్టెని నింపేవారు. దీంతో ఆ గ్రామస్థులు ఇతర పనుల కోసం ఆ నీటిని తీసుకొని వెళ్లేవారు. పశువులు తాగిన నీటినే గ్రామస్థులు ఇతర పనుల కోసం వినియోగించేవారు. అంతేకాకుండా గ్రామస్థులంతా నీటి కోసం ఆ పశువుల తొట్టె వద్దకు రావాల్సి వచ్చేది. కొంతమంది ద్విచక్రవాహనాలు, మరికొంత మంది సైకిళ్లపై నీరు తెచ్చుకునేవారు. గ్రామ శివారులో ఉన్న వారు నీటి కోసం నానా తంటాలు పడేవారు. మరికొంత మంది రూ.800 చెల్లించి ట్యాంకర్లను కొనుగోలు చేసి.. ఇళ్ల వద్ద సంపుల్లో నింపుకునేవారు.

● టీడీపీ అధికారంలోకి రాగానే..

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే.. ఆ బోరు బావి వద్ద నీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసింది. ఆ ట్యాంక్ నుంచి గ్రామంలోకి పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. గేట్ వాల్స్, స్టాటర్లు, మోటార్లు ఏర్పాటు చేసింది. దీంతో కొళాయి కనెక్షన్ తీసుకున్న వారు ఓ వ్యక్తిని వాటర్‌మన్‌గా నియమించుకొని.. నెలనెలా అతనికి కొంత డబ్బు ఇచ్చేవారు. ప్రతిరోజు రెండు గంటల చొప్పున ఒక్కొక్క వీధికి నీటిని వదులుతూ గ్రామమంతా సరఫరా చేసేవారు. ఇలా అతను ఓ పద్ధతి ప్రకారం పైప్‌లైన్ల గేట్ వాల్స్ మారుస్తూ.. గ్రామంలోని అన్ని వీధులకూ నీరు సరఫరా అయ్యేలా చేసేవాడు.

● కొందరి వల్ల మళ్లీ సమస్య

అయితే కొంతమంది నెలనెలా డబ్బులు ఇవ్వకపోవడం.. మరికొంత మంది పలుమార్లు తిపించుకుంటా ఉండటంతో.. వాటర్‌మన్ ఆ విధులను మానేసి.. కూలి పనులకు వెళ్తున్నాడు. దీంతో సమస్య మళ్లీ మొదలైంది. గ్రామస్థులు ఇష్టం వచ్చినట్లు పైప్‌లైన్ల గేట్ వాల్స్ మార్చుతుండటంతో గ్రామంలోని పలు వీధులకు నీరు సరఫరా కావడం లేదు. గ్రామంలో కొందరి వల్ల సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని... మళ్లీ నీటి కోసం బోరు వద్ద ట్యాంక్‌కు రావాల్సి వస్తోందని.. ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తోందని ఆ గ్రామస్థులు వాపోతున్నారు.

● అడుగంటిన బోరు

ప్రస్తుతం బోరుబావిలో నీరు అరకొరగా ఉన్నాయి. దీంతో చాలాసేపు మోటర్ వేస్తే ట్యాంక్‌లోకి కొన్ని నీళ్లే వస్తున్నాయి. ఆ నీటినీ సమీపంలోని వారే పైప్‌లైన్ ద్వారా నీటిని వాడేసుకొంటున్నారు. దీంతో పలు వీధుల వారు ట్యాంక్ వద్దకే వచ్చి.. నీటిని తీసుకెళ్తున్నారు. గ్రామంలో మరో బోరు వేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

మరో బోరు వేయించాలి



గ్రామంలో రెండు బోర్లు ఉన్నాయి.. ఒక బోరులో నీరు అడుగంటింది. మరో బోరు వద్ద ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోకి పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. వాటర్‌మన్ లేకపోవడం ఓ పద్ధతి లేకుండా .. ఎవరు పడితే వారు నీటిని గేట్ వాల్స్ తిప్పేసుకొంటున్నారు. దీంతో పలు వీధులకు నీరు రావడం లేదు. ప్రస్తుతం ఆ బోరులోనూ నీరు అరకొరగా వస్తున్నాయి. మరో బోరును ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

- నాగభూషణరెడ్డి, చౌటకుంటపల్లి

వాటర్‌మన్‌ను ఏర్పాటు చేసుకోండి

చౌటకుంటపల్లి గ్రామస్థులు ఓ వ్యక్తిని వాటర్‌మన్‌గా నియమించుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది. ఓ పద్ధతి ప్రకారం నీటిని సరఫరా చేయించుకుంటే అందరికీ నీరు అందుతా యి. పైపులైన్లు మరమ్మత్తులుంటే చేయించి పరిష్కరి స్తాం. స్థలం చూపిస్తే మరో బోరు కూడా వేయిస్తాం.

- మహమ్మద్ బేగ్, పంచాయతీ కార్యదర్శి



ట్యాంక్ వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు



పైప్‌లైన్ ద్వారా వస్తున్న అరకొర నీటి కోసం నిరీక్షణ

క్రైం న్యూస్..

ఇద్దరిపై కేసు నమోదు

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): న్యాయాధికారి ఇంటి ఎదుట విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌ను బెదిరించిన ఇద్దరు వ్యక్తులపై వన్‌టౌన్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. కుంటిమద్ది హెలీప్యాడ్ ఘటన కేసులో నిందితులను అరెస్టు చేసి ధర్మవరం న్యాయాధికారి ఎదుట పోలీసులు ఆదివారం హాజరుపరిచారు. అక్కడ రాజకీయ నాయకులు వస్తున్నారని సమాచారంతో న్యాయాధికారి ఇంటి వద్ద ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అక్కడ జనం గుమికూడి ఉండడంతో అక్కడి నుంచి వెళ్లపోవాలని కానిస్టేబుల్ వారికి సూచించారు. అయితే చెన్నేకొత్తపల్లికి చెందిన పల్లెన్నగారి నీలకంఠారెడ్డి, ఎర్రంపల్లికి చెందిన అరవిందరెడ్డి ఆ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గించడంతో పాటు బెదిరింపులకు దిగారు. దీంతో వారిద్దరిపై కేసు నమోదు చేశామని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

ఓబుళదేవరచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లమాడ మండలం ఎర్రవంకపల్లికి చెందిన వేణుగోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. అతను బైక్‌పై గోరంట్లకు వెళ్తుండగా.. బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ అతన్ని 108 వాహనంలో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

విద్యుత్ షాక్‌తో పందుల మృతి

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం



పెచ్చులూడిన విద్యుత్ స్తంభం

ధర్మవరం, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌లో విద్యుదాఘాతంతో రెండు పందులు మరణించాయి. రాంనగర్‌లో డ్రైనేజీలో ఓ విద్యుత్ స్తంభం ఉంది. ఆ విద్యుత్ స్తంభం పెచ్చులు ఊడి.. కడ్డీలు కనిపిస్తున్నా యి. ఆ కడ్డీలకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఆదివారం మధ్యాహ్నం ఓ పంది ఆ మురుగు కాలువలో వెళ్తూ.. ఆ కడ్డీలను తాకడంతో అది మరణించింది. అనంతరం సాయంత్రం మరో పంది కూడా ఇలానే మరణించింది. ఆ కడ్డీల ద్వారా మురుగు కాలువలో విద్యుత్ సరఫరా అయితే.. ఘోర ప్రమాదం జరిగే అవకాశముంది. ఈ విషయంపై రాత్రి స్థానికులు ఆందోళన చేపట్టారు. ఎవరికైనా ప్రాణాపాయం జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడ్డారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి.. డ్రైనేజీలో ఉన్న విద్యుత్‌స్తంభాన్ని మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

వేసవి శిక్షణ తరగతులకు స్పందన



డ్రాయింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

ధర్మవరంరూరల్, మే4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు భారీ స్పందన వస్తోంది. అనేక మంది చిన్నారులు ఉత్సాహంగా ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. ఆదివారం డ్రాయింగ్, నృత్యంపై శిక్షణ ఇచ్చినట్లు గ్రంథాలయ అధికారిణి అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఇవే కాకుండా విద్యార్థులు స్పోకన్ ఇంగ్లీష్, పెయింటింగ్, క్విజ్, చదరంగం తదితర వాటిపై కూడా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ ముగిసిన అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని, కావున విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా భగీరథ జయంతి

పుట్టపర్తి, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో భగీరథ మహర్షి జయంతిని ఆదివారం నిర్వహించారు. బీసీ సంక్షేమశాఖ సహాయ అధికారి గంగాధర్ మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, గాయత్రి పాల్గొన్నారు.



భగీరథుడి చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఉద్యోగులు

వంక ఆక్రమణతో తిప్పలు

చిన్నపాటి వర్షానికే రాకపోకలకు ఇబ్బంది

అధికారులకు విన్నవించినా ప్రయోజనం శూన్యం



వంకను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్ (ఫైల్)

సోమందేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని షిర్డీనగర్‌లో ఉన్న వంక ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవడంలో మీనమేశాలు లెక్కిస్తుండటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికి ఎక్కడికక్కడ వర్షం నిలబడి తీవ్ర ఇబ్బంది కలుగుతోందని వారు పేర్కొంటున్నారు. సర్వేనంబరు 761, 762, 763లో అక్కమ్మగార్లకొండ నుంచి దొడ్డికుంట మీదుగా వంక పూర్వం నుంచి ఉందని, కాలనీ ఏర్పాటు నుంచి వంకను పూడ్చి కొంతమంది నిర్మాణం చేపట్టారన్నారు. దీంతో సమస్య ఉత్పన్నమైందని షిర్డీనగర్‌వాసులు పేర్కొంటున్నారు. కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆర్డీఓ ఆనంద్‌కుమార్ వంక సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారిస్తామన్నారు. అయితే ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. రెండు రోజుల నుంచి కురుస్తున్న చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయమై బురదగా మారి నడవడానికి వీలులేకుండా పోయిందన్నారు. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతోందన్నారు. వర్షాలు జూన్‌లో ప్రారంభమైతే తమ పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంక ఆక్రమణపై చర్యలు చేపట్టడంలో అధికారులు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం



వంక ఆక్రమణతో కాలనీలో నిలిచిన వర్షపు నీరు

లేదన్నారు. వంక వెంబడి సర్వే నిర్వహించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. హద్దులు నిర్ణయించి భవిష్యత్తులో ఎవరూ అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు. నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ఇళ్లు నెమ్మెక్కి కూలడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షం నీరు సాఫీగా వెళ్తే సమస్య ఉండదని తెలిపారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రజలు గంగాధర్, మంజునాథ్, శ్రీనివాసులు, గాయత్రి, నారాయణ, కోనమ్మ, రాజు, కేశవ, భాగ్యలక్ష్మీ, శశి, రఘునాథ్‌రెడ్డి, హిమబిందు, లావణ్య, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



వంక ఆక్రమణపై వెంటనే చర్యలు తీసుకోవాలి. వర్షం వస్తే కాలనీలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. చిన్నపాటి వర్షానికే రోడ్లు జలమయమవుతున్నాయి. సమస్యను పరిష్కరించాలి.

- చేలూరు గంగాధర్, జనసేన నాయకుడు, షిర్డీనగర్

కాలనీని సందర్శించి సమస్య పరిష్కరిస్తాం

సమస్య నా దృష్టికి రాలేదు. షిర్డీనగర్ కాలనీని సందర్శించి స్థానికులతో చర్చిస్తాను. వంక ఆక్రమణలపై సర్వేచేసి చర్యలు తీసుకుంటాం. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తాను.

-మారుతి, ఇన్‌చార్జి తహసీల్దార్

ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘన స్వాగతం

చిలమత్తూరు, మే 4(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ పురస్కారాన్ని అందుకొని హిందూపురం నియోజకవర్గంలో మొదటి సారిగా అడుగుపెడుతున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకి టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. బాలకృష్ణ ఆదివారం బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన కొడికొండ చెక్‌పోస్టు మీదుగా హిందూపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున బాగేపల్లి టోల్‌గేటు వద్దకు చేరుకొని ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, మండల కన్వీనర్ రంగారెడ్డి, బేకరీ గంగాధర్, లక్ష్మీనారాయణయాదవ్, కురుబ చంద్రశేఖర్, శ్రీదేవి, తిప్పారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఎమ్మెల్యేను అభినందించారు.



బాలకృష్ణను సన్మానిస్తున్న కొల్లకుంట అంజినప్ప

ఘనంగా ఎంఎస్ రాజు పుట్టినరోజు

మడకశిర టౌన్, మే4(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు ఎంఎస్ రాజు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు, ఆర్.అనంతపురం గేట్ నుంచి ఎమ్మెల్యేకు జన్మదిన శుభకాంక్షలు చెప్పడంతో పాటు భారీ ర్యాలీగా మడకశిరకు చేరుకున్నారు. జేసీబీలతో పూలవర్షం కురిపించారు. అనంతరం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామి ఇంటిలో 45సంవత్సరాలు పురస్కరించుకొని 45కేజీల కేక్ కట్ చేశారు, గుండుమలతిప్పేస్వామి ప్రత్యేకంగా ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులు ఎమ్మెల్యేకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, జిల్లా లీగల్‌సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ, గుండుమలజయప్ప, జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్. డాక్టర్ కృష్ణమూర్తి, బేగార్లపల్లి రవి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్ రాజుకు కేక్ తినిపిస్తున్న గుండుమల తిప్పేస్వామి

నా జీవితం మడకశిరకు అంకితం: ఎమ్మెల్యే

మడకశిర టౌన్, మే4(ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గం అభివృద్ధి తన లక్ష్యమని, తన జీవితం మడకశిరకు అంకితం అని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. త్వరలో అమరాపురం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్నాయుడు చేతుల మీదుగా వక్క మార్కెట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ నెలలోనే పర్యటన ఉండవచ్చన్నారు. త్వరలో నియోజకవర్గంలో 20వేల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి స్వంతింటి కల నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చిలమత్తూరు, మే 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడికొండ ప్రభుత్వ పాఠశాలలో 2006-07 విద్యాసంవత్సర పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అప్పటి గురువులను శాలువాలతో సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ తరగతి గదుల్లో అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థి దశలో అల్లరి చేసిన విధానం, ఒకరికొకరు పిలుచుకున్న మారుపేర్లతో పిలుచుకొన్న విషయాలు, తరగతిలో అల్లరి చేసినప్పుడు గురువులు దండించిన విషయాలను నెమరువేసుకొని ఆనందించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో గురువులు ఫణికుమార్, కుళ్లాయిరెడ్డి, గంగాధర్, ఉమాదేవి, సుధాకరరెడ్డి, మదుసూదన్, రామచంద్రరావు, ఆంజినేయులు, జనార్ధన్, గాయిత్రి, అరుణ మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటుచేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి కాలంలో చదువు ముగిసిన తరువాత ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సంబంధాలు తెగిపోతున్నాయని, అయితే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాబాజాన్, హరినాథరెడ్డి, ఇమామ్, వెంకటేశులు, రమేష్, మహేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



గురువులతో కొడికొండ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ఘనంగా భగీరథ జయంతి



హిందూపురంలో భగీరథుడి విగ్రహం వద్ద నాయకులు, ఉప్పర కులసంఘం నాయకులు

హిందూపురం, మే 4(ఆంధ్రజ్యోతి): భగీరథ జయంతి వేడుకలను హిందూపురంలో ఘనంగా నిర్వహించారు. ఆటోనగర్‌లో ఉన్న భగీరథ సర్కిల్లో మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, ఎమ్మెల్యే పీఏ వీరయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అపర భగీరథుడి వలె గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హిందూపురానికి నీటిని తీసుకొచ్చి పుర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఉప్పర, సగర నాయకులు వెంకటనారాయణ మారుతి, కదిరప్ప, రామప్ప, అశ్వత్తప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బీజేపీ ఆధ్వర్యంలో భగీరథ జయంతిని నిర్వహించారు.

విద్యతోనే అభివృద్ధి

సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): విద్యతోనే అభివృద్ధి అని టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భగీరథ జయంతిని ఆదివారం మండల కేంద్రంలో ఉప్పర, సగర కులస్థులు ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి క్రాస్‌వద్ద ఉన్న భగీరథ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉప్పర, సగరులు చదువుతోనే అభివృద్ధి సాధించాలన్నారు. విద్యతోనే అభివృద్ధి అని పేర్కొన్నారు. పిల్లలను బాగా చదివించి వారి బంగారు భవిష్యత్తుకు పాటుపడాలన్నారు. వెంకటరమణ మాట్లాడుతూ భగీరథుడు పట్టుదలతో భువి నుంచి గంగను నేలపైకి తీసుకురావడం జరిగిందన్నారు. అదే పట్టుదలతో ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశులు, డివి ఆంజనేయులు, సూరీ, శ్రీరాములు, సర్పంచ్ నరసింహులు, చిన్నబాబయ్య పాల్గొన్నారు.



సోమందేపల్లిలో...

పావగడ, (ఆంధ్రజ్యోతి): దివి నుంచి భువికి గంగను పట్టుదలతో భగీరథుడు తీసుకురావడం జరిగిందని తహసీల్దార్ వరదరాజు అన్నారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో భగీరథ జయంతిని నిర్వహించారు. భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో అనీల్‌కుమార్, అంజినప్ప, నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పకడ్బందీగా ప్రవేశ పరీక్ష



పరీక్షను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్

గుడిబండ, మే 4(ఆంధ్రజ్యోతి): గుడిబండ మహాత్మ జ్యోతి బాపూలే బాలికల జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆదివారం పరీక్ష నిర్వహించారు. 250 మంది పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోగా 179 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ పరీక్షలను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

లేపాక్షి (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రవేశ పరీక్షకు 701మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 411మంది హాజరయ్యారు. 290మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ సుందర్‌రాజు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

గుడిబండ, మే 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్.రాయాపురం గ్రామంలో దళితులు ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఈరలక్కప్ప, జిబి శివకుమార్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కాంగ్రెస్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

సోమందేపల్లి, మే 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం అనారోగ్యంతో మృతిచెందిన చేనేత చంద్రశేఖర్ (49) కుటుంబాన్ని తొగటవీరక్షత్రియ సంఘం నాయకులు సీసీ హరి బృందం పరామర్శించింది. రూ.60వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ఇటీవల పది పరీక్షల్లో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన మృతుడి కుమార్తె ఉన్నత చదువులకు అయ్యే ఖర్చులు భరిస్తామన్నారు. కార్యక్రమంలో తొగటవీరులు దేవాంగం పద్మచార్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

పెనుకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఅండ్ఐజీ చర్చి వద్ద ఆదివారం అమన్ పీస్ సర్వీస్‌ఫర్ హ్యూమానిటీ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆదివారం చర్చివద్ద ప్రార్థనల అనంతరం పాస్టర్ ఫ్రాన్సెస్, అల్‌కౌసర్ స్వచ్చంద సంస్థ అధ్యక్షుడు మహ్మద్ అహ్మదీ, కమిటీ సభ్యులు పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాన్‌ప్రియనాథ్, కిష్టఫర్, అమన్ పీస్ సర్వీస్ గౌరవసభ్యులు సయ్యద్ శెక్షావలి, షేక్ రోషన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ

ముగ్గురికి గాయాలు



చెట్టును ఢీకొన్న లారీ

పెనుకొండ రూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలంలోని తురకలాపట్నం వద్ద ప్రమాదవశాత్తు లారీ చెట్టుకు ఢీకొనడంతో హోంగార్డు, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాల మేరకు పావగడ నుంచి పెనుకొండవైపు లారీ వెళ్తోంది. రొద్దంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలాజీ విధులు ముగించుకుని పెనుకొండ వెళ్లేందుకు లారీ ఎక్కాడు. ఈ క్రమంలో తురకలాపట్నం వద్దకు రాగానే లారీ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న చెట్టును ఢీకొంది. ప్రమాదంలో డ్రైవర్ నరసింహమూర్తి, హోంగార్డు బాలాజీ, మరోవ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడ్డవారిని 108లో పెనుకొండ ఆసుపత్రికి తరలించారు.

రేపట్నుంచి సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

కొత్తచెరువు, మే 4(ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి 14వతేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు కందికేరి మనోహర్, నాగరాజు, నటరాజ్, ఫణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. 6న ధ్వజారోహణం, 7న హంసవాహనం, 8న భృంగి, 9న శేషవాహనం, 10 నందివాహనం, 11న పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం, 12న మడుగుతేరు, 13న పారాటోత్సవం, 14న వసంతోత్సవం, పుష్పయాగం, ఊంజల్ సేవతో ఈ ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

బాలయ్య సన్మాన దృశ్యాలు



ర్యాలీలో భార్య వసుంధరతో బాలయ్య



మాట్లాడుతున్న బాలకృష్ణ



సాంస్కృతిక కార్యక్రమాల్లోని ఓ దృశ్యం

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



అమరాపురం, మే 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో శైవక్షేత్రమైన ఎంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ తెలిపారు. ఉదయాన్నే వివిధ రకాల అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామిని వెండి కవచం ధరింపజేసి ప్రత్యేక అలంకరణలు చేశారు. అదేవిధంగా దొడ్డనేశ్వరస్వామి, మల్లేశ్వర స్వామి, విరుపాక్షి స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు మహామంగళహారతి, తీర్థప్రసాదాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు చెన్నకేశ్వరస్వామి, శివకుమార్‌స్వామి, రవిశంకర్, మహేశ్వర, గౌతమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి సవిత పర్యటన

పెనుకొండరూరల్, మే 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సోమవారం పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటలకు రొద్దం మండలంలోని ఎం.కొత్తపల్లిలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు పంపిణీ, 11గంటల నుంచి 12గంటల వరకు పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. మధ్యాహ్నం 3గంటలకు సోమందేపల్లి మండలం నడింపల్లి గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు భూమిపూజ, 4గంటలకు గుడిపల్లి పంచాయతీ వెలగమాకులపల్లిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజలో పాల్గొంటారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

పెనుకొండ, మే 4(ఆంధ్రజ్యోతి): వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు, ప్రజల దాహార్తిని తీర్చడానికి స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో టీడీపీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం చలివేంద్రాన్ని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపకరిస్తాయన్నారు. ప్రయాణికులు, వారపుసంతకు వచ్చే వారికి చలివేంద్రాల ద్వారా దాహం తీర్చడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులు, కన్వీనర్ శ్రీరాములు, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

'బహుజనులు తలెత్తుకుని తిరగాలి'

పెనుకొండ టౌన్, మే 4(ఆంధ్రజ్యోతి): విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో బహుజనులు రాణించి తలెత్తుకుని తిరిగేలా తయారవ్వాలని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ పేర్కొన్నారు. స్థానిక మార్కెట్‌యార్డ్‌లో అంబేడ్కర్ జయంతి పెద్దఎత్తున నిర్వహించడం, విజయవంతం కావడంతో బహుజనులు చైతన్యవేదిక సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. అధ్యక్షులు శివరామక్రిష్ణ మాట్లాడుతూ బహుజనులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం హక్కులను సాధించుకుందామని సూచించారు. ఈ కార్యక్రమంలో రామక్రిష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న బహుజన చైతన్యవేదిక సభ్యులు